

### టన్ను చీనీ రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20 వేలు పలికాయి. మార్కెట్‌కు 722 టన్నుల చీనీ కాయలు అమ్మకానికి వచ్చాయి.



### కిలో టమాట రూ.37

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.37, కనిష్టంగా రూ.24 ప్రకారం పలికినట్లు అధికారులు తెలిపారు.

గరిష్ఠం/కనిష్ఠం
33.2°/22.9°

జిల్లా వ్యాప్తంగా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 12 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

## న్యూస్‌రీల్

### అర్హులైనా.. పింఛన్ ఇవ్వలేదు

- కుణుతూరులో వృద్ధుల అగచాట్లు
- రోజూ సచివాలయం చుట్టూ ప్రదక్షిణ



పింఛన్ కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులు

ధర్మవరం రూరల్: ''మాకు అన్ని అర్హతలున్నాయి...ఏళ్లుగా పింఛన్ తీసుకుంటున్నాం. కానీ ఈ సారి పింఛన్ ఇవ్వడం లేదు. ఎందుకని అడిగితే ఎవరూ ఏమీ చెప్పడం లేదు'' అంటూ పండుటాకులు కన్నీరుమున్నీరవుతున్నారు. మండల పరిధిలోని కుణుతూరు పంచాయతీలో వైఎస్సార్ సీపీ మద్దతుదారులన్న ముద్ర వేసి పలువురికి పింఛన్ మొత్తం పంపిణీ చేయకుండా నిలిపివేశారు. దీంతో పింఛన్ మొత్తంపైనే ఆధారపడి జీవనం సాగించే వృద్ధులు రోజూ సచివాలయానికి రావడం...అధికారులు ఎలాంటి సమాధానం చెప్పకపోవడంతో వెనక్కు వెళ్లడం జరుగుతోంది. శనివారం కూడా సచివాలయం వద్దకు వచ్చిన వృద్ధులు.. టీడీపీ నాయకులు రాజకీయ కక్షతో అధికారులపై ఒత్తిడి తెచ్చి తమకు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. ఈ విషయంపై ఇప్పటికే ఆర్డీఓకు వినతి పత్రం ఇచ్చామని, అయినా స్పందన లేదన్నారు. అర్హతలుండీ, పింఛన్ జాబితాలో పేరున్నా తమకు పింఛన్ మొత్తం ఇవ్వని అధికార యంత్రాంగంపై త్వరలోనే కోర్టుకు వెళ్తామని పేర్కొన్నారు.

### ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా అభిషేక్‌కుమార్



పుట్టపర్తి అర్బన్: ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌ను నియమిస్తూ శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ అరుణ్ బాబును ఇటీవల ప్రభుత్వం పల్నాడు జిల్లాకు బదిలీ చేసి, ఆయన స్థానంలో టీఎస్ చేతన్‌ను నియమించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కలెక్టర్ అరుణ్‌బాబు శనివారం రిలీవ్ కాగా, ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా అభిషేక్ కుమార్‌ను నియమించారు. నూతన కలెక్టర్ టీఎస్ చేతన్ బాధ్యతలు స్వీకరించే వరకూ అభిషేక్ కుమార్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించనున్నారు.

### ఎరువుల దుకాణాలపై 'విజిలెన్స్' దాడులు

- మడకశిరలో రూ.14.59 లక్షల విలువైన ఎరువుల సీజ్



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు

మడకశిర: పట్టణంలోని ఎరువుల దుకాణాలపై శనివారం విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు దాడులు చేశారు. ఇతర జిల్లా నుంచి వచ్చిన ఏడీఏ శివకుమార్, విజిలెన్స్ ఎస్‌ఐ రంజిత్‌కుమార్ పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లోని తనిఖీలు చేశారు. రిజిస్టర్లు, రసీదులు పరిశీలించడంతో పాటు ఎరువుల నిల్వలు తనిఖీ చేశారు. హిందూపురం రోడ్డులోని ఓ ఎరువుల దుకాణంలో తనిఖీ సమయంలో రిజిస్టర్‌లో నమోదు చేసిన వాటికి, నిల్వ ఉన్న ఎరువులకు తేడా ఉండడంతో రూ.14.59 లక్షలు విలువైన 15.45 టన్నుల వివిధ రకాల ఎరువులను సీజ్ చేశారు. అంతేకాకుండా రూ.1.01 లక్షలు విలువ చేసే 47 లీటర్ల పురుగుల మందుల అమ్మకాలను నిలిపి వేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఎరువులు విక్రయించాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీలర్లు తప్పని సరిగా ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు రసీదులు ఇవ్వాలన్నారు. స్టాక్ రిజిస్టర్లను కూడా సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. దాడుల్లో స్థానిక ఏడీఏ కృష్ణమీనన్, ఏఓ తిమ్మప్ప పాల్గొన్నారు.

### తుంగభద్రకు భారీగా వరద



తుంగభద్ర జలాశయం

అనంతపురం సెంట్రల్/బొమ్మనహాళ్: కర్ణాటకలోని హొస్పేట వద్ద ఉన్న తుంగభద్ర జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. డ్యాం ఎగువన కురుస్తున్న వర్షాలతో వరద పోటెత్తుతోంది. ఈ ఏడాది అత్యధికంగా శనివారం మధ్యాహ్నం 57,347 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. సగటున 53,233 క్యూసెక్కులు వస్తున్నట్లు హెచ్చెల్సీ అధికారులు తెలిపారు. 14.663 టీఎంసీల నీరు ఉన్నట్లు వివరించారు. ఔట్‌ఫ్లో 355 క్యూసెక్కులు, కర్ణాటక ప్రాంతంలోని తాగునీటి అవసరాలకు 289 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

# షాడో ఎమ్మెల్యేలు!

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి నెలరోజులు గడిచింది. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలు అప్పుడే నియోజకవర్గాల్లో కనిపించడం లేదు. ఎమ్మెల్యేల బంధువులు, అనుచరులు, పీఏలు పెత్తనం చేస్తున్నారు. ఎంతో నమ్మకంతో ఓటేసి గెలిపిస్తే ఇదేనా మీరు మాకు చేసే సేవ అంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు.

- పదవి ఒకరిది.. పెత్తనం మరొకరిది
- పుట్టపర్తి, హిందూపురం, మడకశిరలో ఇష్టారాజ్యం
- ఎమ్మెల్యేల బంధువుల తీరుతో అధికారులకు ఇబ్బందులు
- సమీక్షలు నిర్వహిస్తూ ఆదేశాలు జారీ చేస్తుండటంపై విస్మయం




సాక్షి, పుట్టపర్తి

జిల్లాలో షాడో ఎమ్మెల్యేల హవా నడుస్తోంది. ఎమ్మెల్యే ఒకరైతే.. కుటుంబ సభ్యుల్లో మరొకరు పెత్తనం చేస్తూ రాజకీయాల్లో కొత్త ఒరవడిని సృష్టిస్తున్నారు. అధికారిక కార్యక్రమాల్లోనూ పాల్గొంటూ దర్జాగా ఆదేశాలు జారీ చేస్తున్నారు. అధికారంలోకి వచ్చి నెల రోజులు కూడా గడవక ముందే పుట్టపర్తి, మడకశిర, హిందూపురంలో ప్రజలకు వింత పరిస్థితులు ఎదురవుతున్నాయి. షాడో ఎమ్మెల్యేలకు ఎలాంటి హోదా లేకున్నా.. అధికారిక కార్యక్రమాల్లోనూ పాల్గొంటున్నారు. సమీక్షలు నిర్వహిస్తూ ఆదేశాలిస్తుండటంతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రశ్నిస్తే ఎక్కడ బదిలీ చేస్తారోనని భయపడిపోతున్నారు. జనం కూడా షాడో ఎమ్మెల్యేల తీరుపై పెదవి విరుస్తున్నారు.

**ధర్మవరంలో చక్రం తిప్పుతున్న శ్రీరామ్..**

ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ రాష్ట్ర మంత్రిగా ఇతర ప్రాంతాలకే పరిమితం కాగా...నియోజకవర్గంలో పరిటాల శ్రీరామ్ చక్రం తిప్పుతున్నారు. అన్ని విషయాల్లోనూ అయనే జోక్యం చేసుకుంటున్నారు. తాను నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌నంటూ పెత్తనం చెలాయిస్తున్నారు. అధికారులను బదిలీలు చేయిస్తానంటూ బెదిరిస్తున్నారు. రాప్తాడులోనూ పరిటాల సునీత ఎమ్మెల్యే అయినప్పటికీ.. అక్కడ కూడా పరిటాల శ్రీరామ్ రాజ్యమేలుతున్నారు. ఎలాంటి పదవి లేకున్నా.. ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో అధికారులపై పెత్తనం చెలాయిస్తున్నారు.

**హిందూపురంలో పీఏల పాలన..**

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సినిమాల్లో బిజీగా ఉండటంతో నియోజకవర్గంలో గత పదేళ్లుగా ఆయన పీఏ (పర్సనల్ అసిస్టెంట్) లే అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. 2014లో బాలయ్య తొలిసారి ఎమ్మెల్యే అయినప్పుడు.. శేఖర్ అనే వ్యక్తి పీఏగా ఉంటూ తానే లోకల్ ఎమ్మెల్యే అన్న తరహాలో ప్రవర్తించారు. మరో పీఏ పేకాట ఆడుతూ కర్ణాటక పోలీసులకు పట్టుబడ్డాడు. ప్రస్తుతం మరో ఇద్దరు పీఏలు తామే నియోజకవర్గ బాధ్యతలు చూస్తున్నామని చెబుతున్నారు. కనిపించని ఎమ్మెల్యే కంటే కళ్లముందుండే పీఏనే బెటరని కార్యకర్తలు కూడా వారి చుట్టే తిరుగుతున్నారు.

**మడకశిరలో మాజీ ఎమ్మెల్సీ హవా..**

ఎస్సీ రిజర్వుడు స్థానమైన మడకశిరలో పెత్తందారు గుండుమల తిప్పేస్వామి హవా నడుస్తోంది. టీడీపీ తరఫున ఎమ్మెల్యే ఎవరైనా.. పెత్తనం మాత్రం మాజీ ఎమ్మెల్సీ గుండుమలదే. అధికారుల బదిలీలు, పాలనా వ్యవహారాలతో పాటు కార్యకర్తలతో నిత్యం టచ్‌లో ఉంటూ ఎమ్మెల్యే తరహాలో అధికారం చెలాయిస్తున్నారు. తనను వ్యతిరేకిస్తే.. టీడీపీలో మనుగడ సాగించడం కష్టమని, భయపెడతారనే ఆరోపణలున్నాయి.

**నామినేటెడ్ కోసం లాబీయింగ్..**

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయా పార్టీల నేతలు నామినేటెడ్ పదవులపై ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేల వద్ద లాబీయింగ్ చేసేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారు. అయితే ప్రతి నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యే బదులు షాడో ఎమ్మెల్యేల హవా నడుస్తుండటంతో ఎవరిని ప్రసన్నం చేసుకోవాలో తెలియక సతమతమవుతున్నారు. అధికారుల బదిలీలు, పోస్టింగులు తదితర వ్యవహారాల్లోనూ షాడో ఎమ్మెల్యేలే కీలకపాత్ర పోషిస్తున్నారు.

**పుట్టపర్తిలో ఎమ్మెల్యే మామదే పెత్తనం..**

జిల్లా కేంద్రం పుట్టపర్తిలో పల్లె సింధూరారెడ్డి పేరుకే ఎమ్మెల్యే. అంతా ఆమె మామ, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డే చూసుకుంటారు. ఆయనే నేరుగా అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. అధికారులకు ఆదేశాలు సైతం జారీ చేస్తున్నారు. చెప్పినట్లు వినని అధికారులను బదిలీ పేరుతో బెదిరిస్తున్నారు. ప్రతి కార్యక్రమంలోనూ ఎమ్మెల్యే కంటే ఆయనే ముందు ఉంటూ షాడో ఎమ్మెల్యేగా మారారు. నియోజకవర్గంలోని అధికారులు, నాయకులతో నిత్యం సమావేశాలు నిర్వహిస్తూ.. ప్రతి సమావేశంలోనూ ఆయనే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు.



ఇటీవల పుట్టపర్తిలో అధికారులతో సమీక్షిస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి (ఫైల్)

### లక్ష్మీమాధవరాయ ఆలయం అద్భుతం

- ఎన్నికల పరిశీలకుడు రిథమ్ భజ్వా



ఆలయాన్ని సందర్శిస్తున్న ఎన్నికల పరిశీలకుడు

గోరంట్ల: పురాతన లక్ష్మీమాధవరాయ ఆలయం అద్భుతంగా ఉందని జిల్లా ఎన్నికల పరిశీలకుడు రిథమ్ భజ్వా అన్నారు. శనివారం ఆయన గోరంట్లలోని పురాతన లక్ష్మీ మాధవరాయ దేవాలయాన్ని సందర్శించారు. స్థానిక తహసీల్దార్ అక్బర్ బాషా, పురోహితుడు తారనాథ్ , ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రిథమ్ భజ్వా మాట్లాడుతూ, ఎంతో ప్రాశస్త్యం ఉన్న లక్ష్మీ మాధవరాయ దేవాలయాన్ని సందర్శించడం ఆనందంగా ఉందన్నారు. ఆలయం పురావస్తుశాఖ ఆధీనంలో ఉన్నప్పటికీ ఎలాంటి అభివృద్ధి జరగలేదని, మూలవిరాట్ ధ్వంసం కావడంతో పూజలకు నోచుకోవడం లేదని..ఆలయ కమిటీ సభ్యులు రిథం భజ్వాకు తెలిపారు. ఆలయంలో పూజలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

### 25 మండలాల్లో మోస్తరు వర్షం

పుట్టపర్తి అర్బన్: ద్రోణి, రుతుపవనాల ప్రభావంతో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకూ జిల్లాలోని 25 మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. చిలమత్తూరులో అత్యధికంగా 39.4 మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే అమడగూరు 28.8 మి.మీ, నల్లచెరువు 28.6, గోరంట్ల 27, రొళ్ల 23.2, ఓడీ చెరువు 22.4, మడకశిర 22, రొద్దం 20.4, లేపాక్షి 19.2, తనకల్లు, హిందూపురం 15.8, గుడిబండ 15.2, ఎన్పీ కుంట 14.6, పరిగి 13.6, గాండ్లపెంట 12.6, కదిరి 12.2, సోమందేపల్లి 11.4, అగళి 10.8, మిగతా మండలాల్లోనూ 8 మి.మీ నుంచి 2.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మరో రెండు రోజులూ జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

## నీచ రాజకీయాలు మానుకోవాలి



కొండారెడ్డి తోటలో నేలకొరిగిన చీనీ చెట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి


- టీడీపీ నేతలకు మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట హితవు

కొత్తచెరువు: నీచరాజకీయాలు మాని, అధికారం ఇచ్చిన ప్రజలకు సేవ చేయాలని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి టీడీపీ నాయకులకు హితవు పలికారు. రాజకీయ కక్షతో వైఎస్సార్ సీపీ నేతలపై భౌతిక దాడులు, ఆస్తుల ధ్వంసం, పొలాల్లోని పచ్చని చెట్లను నరకడం దుర్మార్గమన్నారు. శనివారం ఆయన మండలంలోని మైలసముద్రం, కొడపగానిపల్లి గ్రామాల్లో పర్యటించారు. మైలసముద్రం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, కొండారెడ్డి, నరసింహారెడ్డికి చెందిన 150 చీనీ చెట్లను ఇటీవల కొందరు నరికివేసి బోర్లు, పైపులు ధ్వంసం చేయడంతో దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి బాధిత రైతులను పరామర్శించారు. అనంతరం పొలాల్లోకి వెళ్లి పరిశీలించారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ తరఫున ఆదుకుంటామని బాధిత రైతులకు భరోసా ఇచ్చారు. అనంతరం శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, దేశానికే అన్నం పెట్టే రైతన్నలపై టీడీపీ నేతలు కక్ష గట్టడం అన్యాయమన్నారు. ఆర్థికంగా దెబ్బతీస్తూ...పొలాల్లోని పచ్చని చెట్లని నరికివేయడం దుర్మార్గమన్నారు. ఇలాంటి దాడులకు భయపడేది లేదని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకూ న్యాయ పోరాటం చేస్తామన్నారు. అధికారం శాశ్వతం కాదన్న విషయం టీడీపీ నేతలు గుర్తుంచుకోవాలన్నారు. చేతనైత రైతులకు సాయం చేయాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు నియోజకవర్గంలో ఎక్కడ జరిగిన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం కొడపగానిపల్లిలో ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు ఇంటికి వెళ్లి ఇటీవల బైక్ ప్రమాదంలో గాయపడిన ఆయన కుమారుడు శ్రీహరిని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కొడపగానిపల్లి రఘునాథరెడ్డి, తలమర్ల శ్యాంసుందర్‌రెడ్డి, సర్పంచ్ ప్రకాష్, నాయకులు దాల్‌మిల్ సూరి, పాదయాత్ర వాల్మీకి శంకర్, నారేపల్లి రమణారెడ్డి, పోతిరెడ్డి, డాక్టర్ నరసింహారెడ్డి, కొడపగానిపల్లి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పురాతన కట్టడాలను పరిరక్షించుకోవాలి



పెనుకొండ కొండపై లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని తిలకిస్తున్న విలాస్ షిండే



తిమ్మరుసు బంధిఖానాను పరిశీలిస్తున్న షిండే, అధికారులు

- కార్పొరేట్ యాజమాన్యాలు ఇందుకు కృషి చేయాలి
- ఐఆర్ఎస్ విలాస్ షిండే

పెనుకొండ: పురాతన కట్టడాలను పరిరక్షించేందుకు కార్పొరేట్ యాజమాన్యాలు కృషి చేయాలని ఐఆర్ఎస్ విలాస్ షిండే పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో అనంతపురం జిల్లా ఎన్నికల పరిశీలకుడిగా వచ్చిన విలాస్ షిండే విధుల్లో భాగంగా శనివారం పెనుకొండలో పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పురాతన కట్టడాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇక్కడి ప్రాచీన కట్టడాలు అద్భుతంగా ఉన్నాయని, వీటిని కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. ప్రభుత్వ పరంగా తగు చర్యలు తీసుకుంటున్నప్పటికీ.. నిధుల లేమితో చాలా కట్టడాలు దెబ్బతిన్నాయన్నారు. అందువల్ల కార్పొరేట్ యాజమాన్యాలు సామాజిక బాధ్యతగా పురాతన కట్టడాల పరిరక్షణకు పాటుపడాలన్నారు. చారిత్రక కట్టడాల సంరక్షణ గురించి త్వరలోనే 'కియా' యాజమాన్యంతో మాట్లాడి సీఎస్ఆర్ కింద నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా గైడ్ వెంకటేసులు కట్టడాల ప్రాధాన్యత, వాటి చరిత్ర గురించి విలాస్ షిండేకు వివరించారు. అదేవిధంగా పురావస్తు, ప్రదర్శనశాలల ఏడీ రంజిత గగన్‌మహల్ చరిత్ర, ఇండోపార్శియా శైలితో నిర్మించిన విధానం, తిమ్మరుసు బంధిఖానా, తిమ్మరు చరిత్ర, కృష్ణదేవరాయల చరిత్ర ఇతర కట్టడాల గురించి వివరించారు. కార్యక్రమంలో డివిజనల్ అభివృద్ధి అధికారి శంకర్, జోత్స్న తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక పద్ధతులతోనే చీనీ లాభాలు

- 'ఐసీఏఆర్' శాస్త్రవేత్తల బృందం



మర్తాడులో ఎండుతెగులు సోకిన చీనీ చెట్టును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

అనంతపురం అగ్రికల్చర్/గార్లదిన్నె: ఆధునిక సాంకేతిక పద్ధతులు, మేలైన యాజమాన్యం పాటించినప్పుడే చీనీ తోటల ద్వారా లాభాలు చేకూరుతాయని అఖిల భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్) శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఆయా విషయాలపై అధికారులతో పాటు రైతులు, నర్సరీ నిర్వాహకులకు శిక్షణ అవసరమని తెలిపారు. 10 మంది శాస్త్రవేత్తలు శనివారం జిల్లాకు వచ్చారు. స్థానిక డ్వామా హాలులో హార్టికల్చర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా చీనీ తోటల సాగు, హెక్టారుకు సగటు దిగుబడి, వార్షిక దిగుబడులు, రైతుల పరిస్థితి, పంటకు ఆశిస్తున్న చీడపీడలు, తెగుళ్లు, వాటి నివారణకు అందిస్తున్న సిఫారసులు తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామంలో చీనీ తోటలను పరిశీలించారు. నీటి సమస్యతో పాటు ఎండు తెగులు, పొలుసు పురుగు కారణంగా చీనీతోటల మనుగడ కష్టంగా ఉన్నట్లు రైతులు తెలిపారు. పెరిగిన పెట్టుబడులతో నష్టాలు వస్తున్నాయని వాపోయారు. ఈ సందర్భంగా బృందం ప్రతినిధి డాక్టర్ రాజేశ్వర్‌సింగ్ ఛండేల్ మాట్లాడుతూ కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ పరిధిలో ఐదేళ్లకోసారి శాస్త్రవేత్తల బృందాలు వివిధ రకాల పంటల స్థితిగతులు, భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యల గురించి అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. అవగాహన లేకుండా అధిక మోతాదులో నీరు పెట్టడం, డ్రిప్పర్ వద్దనే ఒకే చోట ఎక్కువగా ఎరువులు వేయడం కారణంగా ఎండుతెగులు వస్తోందన్నారు. ప్రతి సంవత్సరం మట్టి తోలడం కారణంగా ఫంగస్ చేరుకుంటోందన్నారు. ప్రభుత్వ ధ్రువీకరణ ఉన్న నర్సరీల నుంచి మాత్రమే మొక్కలు తెచ్చుకోవాలని సూచించారు. రంగాపూర్ జాతి అంట్లతో మేలు కలుగుతుందన్నారు. భవిష్యత్తుల నాణ్యమైన మొక్కలు రైతులకు అందించేలా నర్సరీ నిర్వాహకులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నర్సరీల్లో వాడే మట్టి సోలరైజేషన్ చేయాలని, ఆర్గానిక్ మల్చింగ్ పాటించాలన్నారు. పొలుసు పురుగు నివారణకు మినరల్ ఆయిల్ వాడాలన్నారు. హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రెండు జిల్లాల ఉద్యానశాఖ అధికారులు జి.ఫిరోజ్‌ఖాన్, జి.చంద్రశేఖర్, హెచ్ఓ రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక గూగూడు



గూగూడులో కొలువుదీరిన కుళ్లాయి స్వామి పీర్లు



ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన అగ్నిగుండం

- నేటి నుంచి ఉత్సవాలు

నార్పల: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన గూగూడు కుళ్లాయిస్వామి ఉత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. నేడు స్వామి వారి ప్రథమ దర్శనం, 8వ తేదీన నిత్యపూజ నివేదన, 9న అగ్ని గుండం ఏర్పాటు, 10న స్వామి వారిని నిలుపుట, 11న నిత్యపూజ నివేదన, 12న ఐదవ సరిగెత్తు, 13న నిత్యపూజ నివేదన, 14న ఏడవ చిన్న సరిగెత్తు, రాత్రికి దేవుని మెరవణి, 15న నిత్యపూజ నివేదన, విడిదినం, 16న పెద్ద సరిగెత్తు, గ్రామోత్సవం, రాత్రికి దేవుని మెరవణి, అగ్ని గుండం ప్రవేశం, 17న అగ్ని గుండ ప్రవేశం, సాయంత్రం 4 గంటలకు జలధి కార్యక్రమం, 19న స్వామి వారి చివరి దర్శనం ఉంటాయి.

**పేరు ఎలా వచ్చిందంటే..**

గూగూడుకు ఆ పేరు ఎలా వచ్చిందనే విషయంపై ఓ పురాణ కథనం ప్రచారంలో ఉంది. ప్రస్తుతం కుళ్లాయిస్వామి ఉన్న చోట గుహుడు అనే మహర్షి ఓ ఆశ్రమం ఏర్పాటు చేసుకొని శ్రీరాముడి కోసం తపస్సు చేసుకునేవాడు. అరణ్యవాసంలో ఉన్న శ్రీరాముడు తన భార్యను వెదుకుతూ ఈ ప్రాంతానికి వచ్చాడు. గుహుడి ఆతిథ్యాన్ని స్వీకరించాడు. మరోసారి సీతాసమేతుడై గుహుడికి దర్శనమిస్తానని శ్రీరాముడు ఆ పురుషోత్తముడికి తెలియజేస్తాడు. దీంతో ఆనందభరితుడైన గుహుడు అక్కడే తపస్సు చేస్తూ గడిపారు. రావణుడిని సంహరించిన తర్వాత శ్రీరాముడు అయోధ్యకు బయలుదేరుతాడు. అయోధ్యకు చేరే తొందర్లో గుహుడుకు ఇచ్చిన మాటను మరిచిపోతాడు. ఎంత కాలమో వేచి చూసిన గుహుడికి శ్రీరాముడు తన ఆతిథ్యం స్వీకరించకుండానే అయోధ్య చేరిన విషయం తెలుస్తుంది. దీంతో తీవ్రంగా బాధపడిన గుహుడు ఆత్మాహుతికి సిద్ధపడతాడు. దూరదృష్టితో ఈ విషయాన్ని గమనించిన శ్రీరాముడు తన నమ్మిన బంటు అయిన ఆంజనేయుడిని గుహుడి వద్దకు పంపిస్తాడు. తాను త్వరలో సీతాలక్ష్మణ సమేతుడై దర్శనమిస్తానని సందేశం పంపుతాడు. దీంతో గుహుడు తన ప్రయత్నాన్ని విరమించుకొంటాడు. కొన్ని రోజుల తర్వాత సీతారామలక్ష్మణులు గుహుడికి దర్శనమిచ్చి ఒక రోజు ఆతిథ్యాన్ని అందుకొన్నారని పురాణ కథనం. గుహుడు ఆత్మార్పణ చేసుకోవాలని నిర్ణయించుకున్న గుండమే నేడు దేవాలయం ముందు ఉన్న గుండమని, గుహుడు తపస్సు చేసిన ఈ ప్రాంతమే కాలక్రమంలో గూగూడుగా మారిందని చెబుతారు.

**కుళ్లాయిస్వామి చరిత్ర..**

ఒక రెడ్డి కులానికి చెందిన భక్తుడికి ఒక రోజు కలలో టోపీ ధరించిన ఒక దైవ శక్తి కనపడి స్వామి వారి పీరు కనపడే చోటు చెప్పింది. ఈ విషయాన్ని ఆ వ్యక్తి గ్రామస్తులకు తెలపగా వారు వెళ్లి వెతకసాగారు. నిజంగానే ఆ వ్యక్తి చెప్పిన చోట పీరు దొరకడంతో ముస్లింలు ఆ పీరును కుహు అల్లా అని లేదా టోపీ వలి అని, హిందువులు కుళ్లాయి అని సంబోధించారు. కుళ్లాయిస్వామి పంజాను ఆంజనేయ స్వామి దేవాలయం వద్దకు తీసుకువచ్చి అక్కడ గుడి ఏర్పాటు చేశారు. ఇక్కడికొచ్చి స్వామి వారిని దర్శించుకుంటే ఆరోగ్య సమస్యలు తొలగుతాయని, సంతానం భాగ్యం కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు.

**పెద్దమ్మకు పూజలు..**

జంట దేవాలయాల ముందు గ్రామ దేవత పెద్దమ్మ దేవాలయం ఉంది. కుళ్లాయిస్వామి మొహర్రం ఉత్సవాల్లో భాగంగా మొదట హనుమాన్ చాలీసా పఠనం, అటుపై కుళ్లాయిస్వామికి చెక్కెర చదివింపులు ఉంటాయి. ఆ తరువాత పెద్దమ్మకు పూజలు చేస్తారు.

## క్లుప్తంగా

### నిత్యావసర ధరలు నియంత్రించాలి


మాట్లాడుతున్న డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి

పుట్టపర్తి అర్బన్: ప్రజలకు ఇబ్బంది కలగకుండా మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించి అమ్మకాలు సాగించాలని జిల్లా పౌరసరఫరాల అధికారి (డీఎస్‌ఓ) వంశీకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మిల్లర్లు, హోల్ సేల్, ట్రేడర్లు, రిటైలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డీఎస్‌ఓ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు పేద కుటుంబాలు సజావుగా సాగడానికి మార్కెట్‌లో ధరలు పెంచి అమ్మకుండా నియంత్రించాలన్నారు. ముఖ్యంగా కందిబేడలు, చక్కెర, బియ్యం, ధరల నియంత్రణపై చర్చించారు. ధరలను నియంత్రించడానికి ట్రేడర్లు సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు. ధరల నియంత్రణతో పాటు నాణ్యమైన వస్తువులను ప్రజలకు విక్రయించాలన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీలు, హోల్ సేల్‌డీలర్లు, ట్రేడర్లు, తదితరులు పాల్గొన్నారు.

### ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా 'వంకదారి'


వంకదారి మద్దిలేటి (రాజా)

తాడిపత్రి అర్బన్: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్) అధ్యక్షునిగా తాడిపత్రికి చెందిన వంకదారి మద్దిలేటి (రాజా)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా తలుపుల సురేంద్రనాథ్, కార్యదర్శిగా జయవరం రామచంద్రయ్య, కోశాధికారిగా కుప్పం రత్నమయ్యతో పాటు 35 మంది సభ్యులతో కూడిన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు ఆదివారం పట్టణంలోని మెయిన్ బజార్‌లోని ఆర్.వి.స్వామి కల్యాణమండపంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

### నేటి నుంచి పశుగ్రాస వారోత్సవాలు

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధక శాఖ అధ్వర్యంలో ఆదివారం నుంచి రైతు సేవా కేంద్రంలో పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించనున్నట్లు శాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పశుసంపద, జీవ సంపద పరిరక్షణలో పశుగ్రాసం ప్రాధాన్యత గురించి అవగాహన కల్పిస్తామన్నారు. ప్రతి రైతూ కొంతైనా పశుగ్రాసం పెంచుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పచ్చిగడ్డి, ఎండు గడ్డి వాడే విధానం తెలియజేస్తామన్నారు.

# బాధితులకు భద్రత, భరోసా

- అమల్లోకి వచ్చిన కొత్త నేర చట్టాలు
- జీరో ఎఫ్ఐఆర్, ఆన్‌లైన్ ఫిర్యాదుకు అవకాశం



నూతన చట్టాలపై పోలీసులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి (ఫైల్)

పుట్టపర్తి టౌన్: బ్రిటిష్ వలస పాలన నాటి చట్టాలైన ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ (ఐఈఏ) 1872 కనుమరుగయ్యాయి. వాటి స్థానంలో పార్లమెంటు ఆమోదించిన నూతన చట్టాలైన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియమ్ (బీఎస్ఏ) -2023 అమల్లోకి వచ్చాయి. ఈ నెల ఒకటో తేదీ నుంచి అమలైన ఈ చట్టాల వల్ల జీరో ఎఫ్ఐఆర్, నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు, ఎస్సెమ్మెస్ లాంటి ఎలక్ట్రానిక్ మాధ్యమాలతో సమన్ల జారీ వంటి అత్యాధునిక విధానాలు న్యాయవ్యవస్థలోకి వచ్చాయి. కొన్ని కేసుల్లో ఎఫ్ఐఆర్ లేకుండానే ప్రాథమిక విచారణ చేసే అవకాశం కల్పించారు. నేరం రుజువుతే ఎఫ్ఐఆర్ నమోదు ఉంటుంది. నూతన చట్టాల ప్రకారం న్యాయమూర్తులు రెండు వారాలకు మించి ఎక్కువ రోజులు కేసును పొడిగించడాని ఇక వీలుండదు. పోలీస్ శాఖకు పూర్తి అధికారాలు ఉండడంతో కేసు త్వరితగతిన పూర్తవుతుంది. కొత్త చట్టాల ద్వారా దర్యాప్తు అధికారులకు అపార అధికారాలు కట్టబెట్టారని న్యావాదులు, బాధితులకు భరోసా, భద్రత, సత్వర న్యాయం జరుగుందని పోలీస్ అధికారులు చెబుతున్నారు.

**జిల్లాలో 67 కేసుల నమోదు..**
జూలై 1 నుంచి కొత్తచట్టాలు అమల్లోకి వచ్చాయి. నెలకు ముందుగానే ఎస్పీ కార్యాలయంతోపాటు సబ్ డివిజన్ల పరిధిలోని పోలీస్ సిబ్బందికి కోర్ ఐటీ టీం ద్వారా, సీనియర్ న్యాయవాదుల ద్వారా నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. నూతన చట్టం ప్రకారం జిల్లాలో పరిగి మండలం జంగాలపల్లిలో ఓ ఆస్తి తగాదాలో జరిగిన గొడవలో బాధితుడు బాలాజీ పిర్యాదు మేరకు అంజినప్ప, నరశింహప్ప, తిప్పన్న అనే ముగ్గురిపై కేసు నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా నూతన చట్టం అమల్లోకి వచ్చినప్పటినుంచి ఇప్పటి వరకు 67 కేసులు నమోదు చేసినట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

| | |
|---|---|
| జిల్లాలో సబ్ డివిజన్లు | 5 |
| సర్కిళ్లు | 21 |
| అర్బన్ పోలీస్టేషన్లు | 12 |
| పోలీస్టేషన్లు | 28 |
| పోలీసు సిబ్బంది | 850 మందికి పైగా.. |

#### పారదర్శకతకు అవకాశం



నూతన చట్టాల్లో వచ్చిన మార్పులు, ముఖ్యమైన అంశాలపై పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించాం. నూతన చట్టాల ద్వారా దర్యాప్తు సంస్థలకు అధికారాలు అధికంగా ఉన్నాయి. వివిధ కేసుల్లో బాధితులకు నేరుగా న్యాయం జరగుతుంది. జిల్లా వ్యాప్తంగా పారదర్శకంగా నూతన చట్టాలు అమలు చేస్తాం. – మాధవరెడ్డి, ఎస్పీ

#### పోలీస్ శాఖకు ఎక్కువ అధికారాలు



నూతన క్రిమినల్ చట్టాల్లో పోలీస్ శాఖకు ఎక్కువ అధికారాలు కేటాయించారు. మెజిస్ట్రేట్ అధిరాలు తక్కువ ఉన్నాయి. నూతన చట్టాల ద్వారా చిన్న కేసు అయినా సరే నేరస్తులు తప్పకుండా శిక్ష అనుభవిస్తారు. ఆన్‌లైన్ విధానం అమల్లోకి వచ్చింది. పాత – కొత్త కేసులు పరిష్కరించడంలో న్యాయ వ్యవస్థకు కొంత మేరకు గందగోళంగా ఉంటుంది. ఏదేమైనా బాధితులకు తక్కువ సమయంలోనే న్యాయం జరుగుతుంది. – కత్తి గంగిరెడ్డి, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

## మార్కెట్‌యార్డులో ప్రశాంతంగా టెండర్లు

- అత్యధికంగా కట్టు తాళ్ల దుకాణం టెండర్


టెండర్ బాక్సులు తెరుస్తున్న సిబ్బంది

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయ మార్కెట్ యార్డులో 9 రకాల పనులకు జరిగిన టెండర్ల ప్రక్రియ శనివారం ప్రశాంతంగా ముగిసింది. ఆర్జేడీ సి.రామాంజినేయులు గైర్హాజరు కావడంతో ఆయన స్థానంలో ఏడీ– మార్కెటింగ్ బి.సత్యనారాయణచౌదరి, సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి సమక్షంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి టెండర్లు ఓపెన్ చేశారు. అత్యధిక కోట్ చేసిన వారికి టెండర్ ఖరారు చేశారు. టెండర్ దక్కించుకున్న వారి వివరాలను సెలెక్షన్ గ్రేడ్‌సెక్రటరీ ఆర్.జయలక్ష్మి వెల్లడించారు. పండ్లు, పశువుల మార్కెట్ క్లీనింగ్ టెండర్‌ను సి.వినోద్‌కుమార్ కైవసం చేసుకున్నారు. ఫిబ్రవరి నుంచి సెప్టెంబర్ వరకు ప్రతి నెలా రూ.79,500, అక్టోబర్ నుంచి జనవరి వరకు ప్రతి నెలా రూ.39,500 ప్రకారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. పండ్లమార్కెట్‌లో సంచార ఫలహార శాల టెండర్ రూ.1.85 లక్షలకు బి.రామక్రిష్ణ దక్కించుకున్నట్లు వివరించారు. మార్కెట్ కట్టుతాళ్ల దుకాణం నిర్వహణ టెండర్‌ను అత్యధికంగా రూ.18 లక్షలకు వై.మచ్చన్న దక్కించుకున్నాడు. ప్రతివారం పేడను ఊడ్చి బయటకు తరలించే టెండర్‌ను నెలకు రూ.25,600 ప్రకారం సి.వినోద్‌కుమార్ దక్కించుకున్నాడు. పశువుల మార్కెట్‌లో ఫలహారశాల టెండర్‌ను రూ.2.61 లక్షలకు పి.రమణయ్య దక్కించుకున్నాడు. పశువుల మార్కెట్‌లో టీ స్టాల్ ఏర్పాటుకు సంబంధించిన టెండర్‌ను రూ.3.75 లక్షలకు ఓంశంకర్ కైవసం చేసుకున్నాడు. 40 మెట్రిక్ టన్నుల వేబ్రిడ్జి టెండర్‌ను రూ.2,09,700 కోట్ చేసిన జి.రామాంజినేయులుకు వచ్చింది. చీనీ గ్రేడింగ్ మిషన్ నిర్వహణ టెండర్‌ను రూ.60,300కు ఎంవీ శ్రీనివాస్, సోడాలు, శీతల పానీయాల అమ్మకం టెండర్ రూ.1.06 లక్షలకు ఎం.రమణయ్య దక్కించుకున్నారు. త్వరలోనే ఆర్జేడీ అనుమతితో వర్క్ ఆర్డర్లు మంజూరు చేస్తామని తెలిపారు.

## అర్ధరాత్రి దొంగల హల్‌చల్

- రెండిళ్లలో 10 తులాల బంగారు చోరీ


దొంగల వేలిముద్రలను పరిశీలిస్తున్న క్లూస్ టీం

చెన్నేకొత్తపల్లి (కనగానపల్లి): కుటుంబ సభ్యులు ఆరుబయట నిద్రించే ఇళ్లను టార్గెట్ చేసుకున్న దొంగలు అర్ధరాత్రి వేళ హల్‌చల్ చేశారు. రెండు ఇళ్లల్లోకి చొరబడి పది తులాల బంగారు ఆభరణాలతో ఉడాయించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కనగానపల్లి మండలం మామిళ్లపల్లికి చెందిన జయరామిరెడ్డి తన భార్య సావిత్రితో కలసి శుక్రవారం రాత్రి ఇంటి ముందు మంచంపై దోమతెర కట్టుకొని నిద్రించారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో దోమతెరను కత్తిరించి నిద్రిస్తున్న సావిత్రి మెడలో ఉన్న 3 తులాల బంగారు తాళిబొట్టు గొలుసును లాక్కున్నారు. హఠాత్పరిణామంతో ఉలిక్కిపడి లేచిన సావిత్రి గట్టిగా కేకలు వేయడంతో దొంగలు అక్కడి నుంచి పారిపోయారు. అలాగే ముక్తాపురంలోకి ప్రవేశించిన దొంగలు.. కుటుంబ సభ్యులతో ఆరుబయట నిద్రిస్తున్న వెంకటనారాయణరెడ్డి ఇంటి వద్దకు వెళ్లి తలుపులు పగలగొట్టి లోపలికెళ్లారు. అల్మారాలో చీరల కింద డబ్బాలో ఉన్న 7 తులాల బంగారుతో పాటు, అక్కడే ఉన్న మొబైల్ ఎత్తుకెళ్లారు. శనివారం తెల్లవారుజామున నిద్ర లేచిన వెంకటనారాయణరెడ్డి తలుపులు తెరిచి ఉండటం గమనించి లోపలికి వెళ్లి చూడగా అల్మారాలోని చీరలు చిందరవందరగా పడి ఉండటం గమనించాడు. డబ్బాలో భద్రపరచిన బంగారాన్ని చూడగా కనిపించ పోవడంతో దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఇళ్లలో చోరీ అయిన వారు కనగానపల్లి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సంఘటన స్థలాలను పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి ముక్తాపురంలోని వెంకటనారాయణరెడ్డి ఇంటిలో వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## అలసిపోయి.. తిరిగిరాని లోకాలకు

- నిద్రలోనే తుదిశ్వాస విడిచిన రైతు


తిప్పేస్వామి (ఫైల్)

బెళుగుప్ప: వ్యవసాయ పనులు చేసి అలసిపోయి ఇంటికి వచ్చి కునుకు తీసిన రైతు నిద్రలోనే తుది శ్వాస విడిచాడు. కుటుంబ పెద్ద ఆకస్మిక మృతితో భార్య, పిల్లలు గుండెలవిసేలా రోదించారు. వివరాలిలా ఉన్నాయి. నక్కలపల్లికి చెందిన వడ్డే తిప్పేస్వామి (44) ఎంఏ, బీఈడీ చదివాడు. వ్యవసాయమంటే ఎంతో మక్కువ. ఆయనకు వారసత్వంగా వచ్చిన రెండు ఎకరాల భూమి వచ్చింది. అందులో పంటలు సాగు చేయడం కోసం బోర్లు వేయించాడు. అలా పది బోర్లు వేయిస్తే అరకొర నీరు పడింది. ఆ నీటితోనే ఉన్న రెండు ఎకరాలకు తోడు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని ప్రస్తుతం మిరప, టమాట తదితర పంటలు సాగు చేశాడు. శుక్రవారం తోటకు వెళ్లిన తిప్పేస్వామి తనొక్కడే టమాట పంటకు పురుగుమందు పిచికారి చేశాడు. అనంతరం ఇంటికి వచ్చి అలసటగా ఉండటంతో కాసేపు నడుం వాల్చాడు. కొద్దిసేపటి తర్వాత కుటుంబ సభ్యులు వచ్చి లేపగా.. స్పందన లేకపోవడంతో వెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే తిప్పేస్వామి మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. తిప్పేస్వామికి భార్య నాగలక్ష్మి, కూతుర్లు మైథిలి, ధన్విశ్రీ,, కుమారుడు సాయిస్వరూప్ ఉన్నారు. పెద్దదిక్కు ఆకస్మిక మృతి ఆ కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చింది. బోర్లు, పంట పెట్టుబడులు, కుటుంబ అవసరాల నిమిత్తం రూ.10లక్షల దాకా అప్పులు చేసినట్లు తెలిసింది. రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. మృతుని కుటుంబానికి గ్రామస్తులు ముత్యాలరెడ్డి, శ్రీనివాసరెడ్డి సోదరులు రూ.20వేల ఆర్థికసాయం అందించారు.

## భర్త చేతిలో భార్య హతం

- మద్యానికి డబ్బు ఇవ్వలేదని ఘాతుకం


మృతి చెందిన లక్ష్మమ్మ

బత్తలపల్లి: మద్యానికి డబ్బు ఇవ్వలేదన్న కోపంలో భార్యను హత్య చేసిన భర్త ఉదంతం తంబాపురంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తంబాపురం గ్రామానికి చెందిన హరిజన లక్ష్మమ్మ(62), లక్ష్మన్న దంపతులు. వీరికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వీరిలో కుమారుడు ముత్యాలప్ప, చిన్నకుమార్తె క్రిష్ణమ్మ జగనన్న లేఅవుట్‌లో ఉన్నారు. లక్ష్మమ్మ దంపతులు మాత్రం ఎస్సీ కాలనీలోని పాత ఇంట్లోనే ఉంటున్నారు. లక్ష్మమ్మ అనారోగ్యంతో మంచానికి పరిమితమైపోయింది. లక్ష్మన్న కూలి పనులు చేసుకుంటూ, దండోరా వేస్తుంటాడు. మద్యానికి బానిసైన ఇతడు ఇంట్లో డబ్బు తీసుకుని తాగేందుకు ఖర్చు చేస్తుంటాడు. లక్ష్మమ్మకు ఈ నెలలో వృద్ధాప్య పింఛన్ కింద బకాయిలతో కలిపి రూ.7 వేలు పంపిణీ చేశారు. ఆ మొత్తాన్ని ఆమె భద్రంగా దాచుకుంది. లక్ష్మన్న మద్యం కోసం డబ్బు ఇవ్వాలని భార్యను ఒత్తిడి చేశాడు. ఆమె ఇవ్వకపోవడంతో కోపోద్రిక్తుడై రోకలిబండతో ఆమె తలపై కొట్టి చంపేశాడు. ఆమె చనిపోయిందని నిర్ధారించుకున్నాక అక్కడి నుంచి పారిపోయాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీనివాసులు సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

### బదిలీల కోసం పైరవీలు

హిందూపురం అర్బన్: రాష్ట్రంలో నూతన ప్రభుత్వం కొలువుదీరాక పలువురు ఉద్యోగులు బదిలీల కోసం పైరవీలు మొదలెట్టారు. పోలీస్, రెవెన్యూ, మండల పరిషత్, రవాణా ఇలా ఏ శాఖలో చూసినా అధికారులు బదిలీల ప్రయత్నాల్లో ఉన్నారు. తమకు అనుకూలమైన స్థానాలు/ప్రాంతాలు వెదుక్కునే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లా వ్యాప్తంగా 32 మండలాల పరిధిలో ఉద్యోగుల బదిలీలు తప్పవన్న సంకేతాలు రావడంతో ఎమ్మెల్యేలు, నాయకులను ప్రసన్నం చేసుకుని సిఫార్సు లేఖలు తెచ్చుకుంటున్నారు. పెనుకొండ డివిజన్‌లోని పోలీస్ అధికారులు శింగనమల, కళ్యాణదుర్గం, మడకశిర వెళ్లేందుకు సిద్ధపడుతుండగా.. చిత్తూరు జిల్లా నుంచి హిందూపురం సబ్ డివిజన్‌కు పోలీస్ అధికారులు రాబోతున్నారు. సీఐ, ఎస్ఐ స్థాయి అధికారులతో పాటు చివరకు కానిస్టేబుళ్లను సైతం తమకు కావలసిన వారిని తెచ్చుకొంటున్నారు. పెనుకొండ, మడకశిర మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో పని చేసేందుకు అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి ఎక్కువ మంది రాబోతున్నారు. ఇక్కడ పని చేస్తున్న వారు ఇతర డివిజన్లు, జిల్లాలకు త్వరలో బదిలీకి సిద్ధమయ్యారు. అయితే తాడిపత్రి, రాప్తాడు వెళ్లేందుకు అధికారులు వెనుకంజ వేస్తున్నారు.

**చెప్పినట్లు వింటేనే సిఫార్సులు!**
తమకు అనుకూలంగా చెప్పినట్లు నడుచుకుంటామనే ఉద్యోగులు, అధికారులకే ఎమ్మెల్యేలు సిఫార్సు లేఖలు ఇస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో పోలీస్, రెవెన్యూ, ఎంపీడీఓ పోస్టులు భర్తీ అయిపోయాయి. నెలాఖరులోగా అధికారులు, ఉద్యోగులు బదిలీ స్థానాల్లో కొలువుదీరనున్నారు.

### వినియోగదారుల సంఘాలను బలోపేతం చేస్తాం

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో వినియోదారుల సంఘాలు బలోపేతం చేసి వినియోదారులకు సత్వర న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామని జిల్లా వినియోదారుల సంఘాల సమాఖ్య చైర్మన్ జి.సురేష్ కుమార్ తెలిపారు. శనివారం పుట్టపర్తి సాయి ఆరామం ఫంక్షన్ హాల్లో ధర్మవరం నారాయణమ్మ అధ్యక్షతన జిల్లా వినియోదారుల సంఘాల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వినియోదారుల సంఘాల సమాఖ్య జిల్లా చైర్మన్‌గా సురేష్ కుమార్, వైస్ చైర్మన్‌లుగా రామిరెడ్డి, వెంకటచలపతి, కుళ్లాయప్ప, కార్యదర్శిగా వెంకటలక్ష్మి, కోశాధికారిగా చంద్రశేఖర్‌గుప్తా, పీఆర్‌ఓగా తాడిమర్రి చంద్రశేఖర్, సెక్రటరీగా గఫూర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా లక్ష్మీనారాయణరెడ్డి, రవీంద్రబాబు, శంకర్‌రెడ్డి, ఈసీ సభ్యులుగా జంగన్న, ఆశాభి, నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### యువకుడి ఆత్మహత్య


వినోద్‌కుమార్ (ఫైల్)

ముదిగుబ్బ: మలకవేమల క్రాస్ రైల్వే గేట్ సమీపాన వినోద్‌కుమార్ (32) అనే యువకుడు శనివారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్ఐ రహీం తెలిపిన వివరాల మేరకు... నల్లమాడ మండలం యర్రవంకపల్లికి చెందిన వినోద్‌కుమార్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తూ ఎనిమిది నెలల క్రితం ఉద్యోగం మానేశాడు. ఏమి సమస్య వచ్చిందో తెలియదు గానీ వినోద్‌కుమార్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు విచారణలో తేలాల్సి ఉంది.

### హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

గుంతకల్లు రూరల్: హత్య కేసులో నిందితులైన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం గుంతకల్లు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సురేష్ మీడియాకు వెల్లడించారు. నల్లదాసరిపల్లికి చెందిన లక్ష్మన్న (50) తన రెండవ కూతురు లలితను దౌల్తాపురం గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌కు ఇచ్చి వివాహం చేశారు. కొద్ది రోజులకే భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. తరచూ గొడవలు జరుగుతుండడంతో లక్ష్మన్న తన కూతురును పుట్టింటికి తీసుకొచ్చేశాడు. తర్వాత పెద్ద మనుషుల పంచాయితీ జరిగింది. ఆ సమయంలో లక్ష్మన్న తన అల్లుడిని చెప్పుతో కొట్టడమే కాకుండా అతడి తండ్రిని చొక్కా పట్టుకుని అవమానించాడు. తాను రౌడీషీటర్ అని, మెట్టినింటిలోని మగాళ్లందరినీ చంపి మరీ తన కూతురు పేరిట మొత్తం ఆస్తి రాయిస్తానని బెదిరించాడు. ఈ ఘటనతో చంద్రశేఖర్ తన మామపై రగిలిపోయాడు. అన్న రాజశేఖర్‌తో పాటు స్నేహితుడు సతీష్ సహాయంతో లక్ష్మన్న హత్యకు పథకం రచించాడు. ఈ నెల నాలుగో తేదీ రాత్రి గుంతకల్లు నుంచి నల్లదాసరపల్లికి వెళ్తున్న లక్ష్మన్నను కాపుకాసి హత్య చేశారు. లక్ష్మన్న ఇంటికి తిరిగిరాకపోవడం, సెల్‌ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు ఫోన్ లొకేషన్‌ను గుర్తించి ఘటనా స్థలానికి చేరుకున్నారు. లక్ష్మన్న హత్యకు గురైనట్లుగా తెలియడంతో క్లూస్ టీం, స్నిప్పర్ డాగ్‌ను పిలిపించి 24 గంటల్లోనే నిందితులను గుర్తించి.. నక్కనదొడ్డి రైల్వేస్టేషన్ వద్ద అరెస్ట్ చేశారు. హత్యకు ఉపయోగించిన రెండు ద్విచక్ర వాహనాలు, రెండు కొడవళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.




నృత్య రూపకంలోని ఘట్టాలు

### సాయి మార్గం ఆచరణీయం

ప్రశాంతి నిలయం: సత్యసాయి చూపిన మార్గం మానవాళికి సదా ఆచరణీయం. ఇదే సందేశంతో నిర్వహించిన సంగీత నృత్యరూపకం భక్తులను మైమరపించింది. పర్తియాత్రలో భాగంగా ప్రశాంతి నిలయానికి విచ్చేసిన సంగారెడ్డి జిల్లా సత్యసాయి భక్తులు సత్యసాయి సన్నిధిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాకు చెందిన బాలవికాస్ చిన్నారులు 'మైనస్ 4 ప్లస్ 2' పేరుతో నృత్యరూపకం నిర్వహించారు. అబద్ధాలు ఆడటం, ఇతరుల చెడు కోరుకోకుండా ఉండటం, చెడు ప్రచారాలు చేయడం, అనవసర మాటలు మాట్లాడటం వంటి 4 చెడు గుణాలు వదిలి, భగవంతుని స్మరణ, ధర్మాన్ని పాటించడం వంటి రెండు గుణాలు అలవర్చుకోవాలన్న సందేశంతో నృత్య రూపకం సాగింది.